# ఎలాంటి శిక్ష?!

**మూడే మూడు గదులున్న చిన్న యిల్లు అది. ముందు గదిలో పెద్ద వాళ్లిద్దరూ పడుకుంటారు. మధ్యగది జయంతి మోహన్‌లది. తర్వాత వంటిల్లు. అది దాటాక చిన్న బాత్‌రూం కమ్ లెట్రిన్. రాత్రుళ్లు పెరట్లోకి వెళ్లాలంటే ముందు గదిలో వున్న వాళ్లు మధ్య గది దాటి వెళ్లాలి. అంటే జయంతి మోహన్ల గది తలుపు కొట్టాలి.**

ఆరోజు రాత్రి మోహన్ ఇంటికి రాలేదు. మోహన్ యించుమించు రోజూ అంతే. అతను రాకపోవడం యింట్లో వాళ్లకి అలవాటే, ఒక్క జయంతికి తప్ప. అందుకే జయంతి అతని కోసం చాలా సేపు ఎదురు చూసింది. ఆఖరికి తన గదిలోకి వెళ్లి లైటార్పేసి పడుకుంది.

రాత్రి పది దాటేక తలుపు మీద నెమ్మదిగా శబ్దం...

జయంతి లేచి వెళ్లింది. దగ్గరగా మూసి ఉన్న తలుపును తెరిచింది.

వచ్చినది మోహన్ కాదు, 'మామగారు'.

"బాత్‌రూంకెళ్లాలి" అన్నాడతను నవ్వుతూ.

జయంతి పక్కకు జరిగింది. అతను బాత్‌రూం కెళ్లాడు.

జయంతి వచ్చి మంచం మీద గోడవేపుకు తిరిగి పడుకుంది. ఆమె మనఃస్థితి ఉదాసీనంగా ఉంది. ఏ నిమిషాన ఏ పరీక్షకు గురికావలసి వస్తుందో అని భయం.

ఇంతలో ఒక చెయ్యి ఆమె జెబ్బమీద పడింది. గతుక్కుమని లేచి కూర్చుంది ఆమె.

ఎదురుగా: వెకిలిగా నవ్వుతూ మామగారు!

అనుమానంగా, భయంగా చూసింది జయంతి.

"అబ్బే... ఏం లేదు. ఏదో పురుగు నీ చేతిమీద పాకుతూంటేనూ... తీసి అవతల పారేద్దామని..."

అతని మాటలు నమ్మదగినవి కావని జయంతికి తెలుసు.

"ఏంటీ! నీకు నిద్ర రావడం లేదా?" అన్నాడతను అదోలా చూసి నవ్వుతూ. అలా నవ్వుకుంటూనే గది దాటి వెళ్లిపోయేడు. ఈ చూపులూ, ఈ (వెకిలి) నవ్వులూ కొన్నాళ్ల నుంచి జయంతి కళ్ల పడుతూనే ఉన్నాయి. 'నిద్రపోతున్న నామీద చేయివేసి 'నిద్ర రావడంలేదా?' అని అడగడంలో ఆంతర్యం ఏమిటి?' అనుకుంది జయంతి. ఏం చెయ్యాలో తెలీడం లేదు. ఎవరికయినా చెప్పడం మాట అటుంచి తనలో తాను అనుకోవడానికే రోతగా ఉంది. భయం భయంగా అతనివైపు చూసింది. మరుక్షణం తల తిప్పుకొని పక్కమీద బోర్లా పడింది.

ఆమె పెదాలు అదురుతున్నాయి. శరీరం సన్నగా కంపిస్తోంది. చెమట్లు పట్టేస్తున్నాయి. ఏడవాలనిపిస్తోంది. పెద్దవాడన్న గౌరవం పోయి అతనంటే అసహ్యం కలుగుతోంది.

మళ్లీ దిగ్గున లేచి కూర్చుంది జయంతి. 'తనకెదురయిన పరిస్థితి లాంటిది ఈ సమాజంలో ఏ ఆడదానికీ ఎదురవకూడదు!' బాధగా అనుకుంది.

ఆ రాత్రి మోహన్ యింటికి రాలేదు.

పెళ్ళయిన కొత్తలో జయంతి కంగారు పడింది భర్త రాత్రుళ్లు రాకపోయేసరికి.

అత్తగారు అదేమంత కొత్త విషయం కానట్టుగా నవ్వేసింది. "వాడికిది అలవాటేనమ్మా. ఇవాళ కాకపోతే రేపు వస్తాడు! రేపు కాకపోతే ఎల్లుండి! కొత్తగా పెళ్లయింది, ఇంట్లో పెళ్ళాం నాకోసం ఎదురుచూస్తూ కూర్చుంటుంది- అన్న యింగితం వాడికి లేనప్పుడు బాధపడి ఏం లాభం! హాయిగా అన్నం తినేసి పడుకో. లేనిపోని ఆలోచనలతో బుర్ర పాడుచేసుకోకు." అదీ కొత్తగా పెళ్లయిన కొడుకు గురించి కోడలితో ఆవిడ మాట ధోరణి! రోజూ రాత్రి పడుకునే ముందు నిద్రమాత్రలు రెండు వేసుకుంటేగాని ఆవిడకి నిద్రపట్టదు. ఓనాడు మాత్రలు వేసుకుంటూ అంది: "పెళ్ళయితే వాడు మారతాడని అనుకున్నాం. ఆ పాపిష్టి జలజని మరిగేడు. వాడు దాన్ని వదలడు. అది వాడ్ని వదలదు. నువ్వే నీ తెలివి తేటలతో, అందచందాలతో చాకచక్యంగా వాడ్ని నీవైపు తిప్పుకుంటావని అనుకున్నాను. కాని ఫలితం లేకపోయింది. నువ్వు మరీ ఇంత మెత్తని మనిషివైతే ఎలాగ? నీకేం పట్టనట్టు అలా వూరుకుంటే లాభం లేదు. ఏదో ఒక వుపాయం ఆలోచించి నీ మొగుడ్ని నీదారికి తెచ్చుకోవాలి!"

'అతని మనసులో నాకు స్థానం లేదు. ఆ స్థానం అతను ఇదివరకే ఎవరికో ఇచ్చేసేడు. ఆ స్థానాన్ని 'నాది' అని బలవంతంగా చేజిక్కించుకోవాలనే ఆలోచనగాని, అవసరంగాని నాకు లేదు. అతను నన్ను పెళ్లి చేసుకున్నాడు. ఎందుకు? నలుగురి కోసం! జీతం బత్తెంలేని నౌకరు కోసం! ఇంటిపని - వంటపని ఎంతో బాధ్యతగా చేసే ఒక మనిషి కోసం! అంతేకాని నాతో కాపురం చెయ్యడానికి మాత్రం కాదు. అతనికి నామీద లేని ప్రేమ - అభిమానాలు, నాకు మాత్రం ఎందుకు?, మనసులో చెప్పలేనంత విరక్తి ఏర్పడింది జయంతికి.

భ్రమరాంబ అంతముఖ్యమైన మాటలూ తేలిగ్గా అనేసింది. కాని వాళ్లు తనకి ఎంత అన్యాయం చేసేరో వాళ్లకి తెలీదా? పెళ్లికి ముందే ఈ విషయాలన్నీ తనకి తెల్సివుంటే తనీ పెళ్లికి ఒప్పుకుని వుండేదేకాదు!

తనకి జరిగిన అన్యాయం తల్చుకుని ఏడ్చి ఏడ్చి అలసిపోయింది జయంతి. ఇహ ఏడుద్దామన్నా కన్నీళ్లు యింకిపోయేయి ఆమెకి. అసలు ఈ సమాజంలో ఆడదానికి అన్యాయం జరగనిదెప్పుడు? తన జీవితమే పెద్ద సమస్య అయిపోయింది.

తనకి భయం, పిరికి తనం రెండూ ఎక్కువే. అందుకేనేమో ఏ సమస్య అయినా భూతద్దంలో చూసినట్టుగా కనండి విపరీతంగా భయపడిపోతున్నది.

★ ★ ★

అత్తగారికి, మావగారికి భోజనం వడ్డిస్తోంది జయంతి.

అత్తగారు తొందరగా భోజనం చేసేసి మాత్రలు వేసుకుందికి గదిలోకి వెళ్లిపోయింది. మామగారు తీరికగా భోం చేస్తున్నాడు.

ఉన్నట్టుండి, మజ్జిగ పోస్తున్న జయంతి చేతిని పట్టుకుని ఆపేస్తూ "వద్దు జయంతీ! మజ్జిగచాలు. మరి వెయ్యకు" అన్నాడు మామగారు (ప్రభాకరం).

మజ్జిగ వద్దని అనడానికి చేయి పట్టుకోవాలా? నోటితో చెప్తే సరిపోతుంది కదా! ఏమో! కూతురైనా అలాగే చేయి పట్టుకుని మజ్జిగ వద్దని అంటారేమో! తనే వున్న మతిపోయి వంకర టింకరగా ఆలోచిస్తున్నాదేమో! మరి... మరి రాత్రి చేయి పట్టుకోవడం?! ఛ... పెద్దాయన. తండ్రితో సమానం! కోడల్ని కూతురిలా భావించి అలా దగ్గరగా మసలుతున్నారేమో!? అయినా ఎందుకనో అలా అనుకుందికి ఆమె మనసు ఒప్పుకోవడం లేదు. సింహాన్ని చూసిన మేకపిల్లలా గజగజ వణికిపోతోంది ఆమె. అతని చూపులు ఆమెని ఏదో భయానికి లోను చేస్తున్నాయి.

★ ★ ★

ఒకరోజు జయంతిని పిల్చి కాళ్లు బాగా లాగుతున్నాయి పట్టమన్నాడు ప్రభాకరం. జయంతి ఒక నిమిషం సందేహించింది. చెప్పిన పని చెయ్యకపోతే ఏమనుకుంటారోనని భయం! ఆ సమయంలో అత్తగారు యింట్లో లేరు. గుడికి వెళ్లింది. జయంతికి హఠాత్తుగా ఎక్కడికైనా పారిపోవాలని అనిపించింది. లేదంటే వున్నపళంగా మాయమైపోయే విద్య తనకి తెలిస్తే బాగుండ్ను అనుకుంది. ఇష్టం లేకపోయినా, భయం కొద్దీ కాళ్లు పట్టడం మొదలుపెట్టింది జయంతి. ఇంకొంచెం మీదకు, ఇంకాపైకి అంటూ బలవంతంగా పట్టించుకున్నాడు ఆయన!

"అబ్బ... ఇప్పుడెంత హాయిగా వుందో" అన్నాడు జయంతి కళ్లల్లోకి చూసి నవ్వుతూ. అతని నవ్వు చూస్తే వంటికి కారం రాసుకున్నట్టుగా వుంది జయంతికి! ఏమిటి? ఏమిటిదంతా?... ఏమీలేదు, పెద్దాయన! మామగారు! అయినా కూతురైతే యిలా కాళ్లు పట్టదేంటి? తనూ అంతే! అని సరిపెట్టుకుందామంటే... ఎందుకో... మనసు ఎదురు తిరుగుతోంది!

ఈ అత్తగారు ఎప్పుడూ యింటి పట్టున వుండదు. ఆవిడకి భక్తి ఎక్కువ. సాయిబాబా భజనలని, ఆంజనేయ స్వామి అని, గుళ్లని, గోపురాలని తిరుగుతూ వుంటుంది. జయంతి పరిస్థితి పిల్లికి చెలగాటం, ఎలుక్కి ప్రాణసంకటం అన్నట్టుగా వుంది. ఎవరితో చెప్పుకుంటుంది? ఏమని చెప్పుకుంటుంది?! చెప్పినా ఎవ్వరూ నమ్మరు, నమ్మలేరు. కాని ఈనిత్య వేదనని ఎలా భరించాలి! ఇలాంటి వాళ్లకి ఎలాంటి శిక్ష వెయ్యాలి? ఆమెకి పిచ్చెత్తినట్టుగా వుంది.

★ ★ ★

జయంతి ఒకరోజు బాత్‌రూంలో స్నానం చేస్తోంది. వివస్త్రగా నిలబడి స్నానం చెయ్యడం ఆమెకి అలవాటు. మైసూర్ శాండల్ సబ్బుతో వళ్లంతా రద్దుకుని ఆ వింత పరిమళాలను హాయిగా ఆఘ్రాణిస్తూ తన అవయవాల్నీ, తన శరీరంలో తనకిష్టమైన భాగాలనీ సున్నితంగా స్పృశించుకుంటూ నెమ్మదిగా స్నానం చేస్తూ ఆనందిస్తున్న సమయంలో... ఉన్నట్టుండి తలుపు మీద టకటకమని చప్పుడయింది. అంతవరకు వున్న ఆనందమంతా ఆ అనుకోని ఆటంకానికి వేడి పెనం మీద నీటి చుక్కలా ఆవిరి అయిపోయింది.!

"జయంతీ! జయంతీ!" కొంప మునిగిపోతున్నట్టు మామగారి కేక వినిపించింది. వెంటనే తలుపు తియ్యలేదు. అమాంతం తలుపు తీసుకుని రాగలిగే పరిస్థితి కాదు తనది!

"ఎవరూ?"

"నేను. నాటవల్ బాత్‌రూంలో మర్చిపోయేను. అర్జంటుగా కావాలి. ఒక్కసారి తలుపుతియ్యి."

గతుక్కుమంది జయంతి.

వెంటనే ఏదో చిన్న అనుమానం కలిగింది. బాత్‌రూం తలుపుకి చిన్న కన్నం గాని లేదు కదా. అందులోంచి అతను తనని... వళ్లంతా అసహ్యంతో గగుర్పొడిచింది. అయినా టవల్ అన్నది అర్జంటుగా కావాల్సిన వస్తువు కాదు కదా. అదికాక తను స్నానం చేస్తున్నాదని తెల్సి ఒక అయిదు నిముషాలు ఆగి తను యివతలకి వచ్చేక అతను లోపలికి వెళ్లి టవల్ తెచ్చుకుంటే సరిపోతుంది కదా! ఈలోగా స్నానం చేస్తున్న తనని అంతలా డిస్టర్బ్ చేయవలసిన అవసరం ఏమిటి?

అదే 'అతనైతే' వెంటనే తలుపు తీసి ఆ మధుర క్షణాలు పంచుకోవడంలో ఎంతో ఆనందం వుండేది. ప్చ్! తన జీవితంలో అంత అదృష్టం కూడానా! దగ్గర కావాల్సిన భర్త దూరంగా వుంటున్నాడు. తండ్రి స్థానంలో వుండాల్సిన మామగారు... యిలా ప్రవర్తిస్తున్నాడు! ఆమెకి ఒక్కసారిగా ఏడుపొచ్చింది.

"ఉండండి యిస్తాను."

"ఒక్కసారి తలుపు తీసి టవల్ అందించు నేను తీసుకుంటాను." అన్నాడతను తొందర చేస్తూ.

"ఏమిటీ మనిషి? కొంపలంటుకుపోతున్నట్టుగా ఆ కేకలేంటి? పోనీ తలుపు సందులోంచి టవల్ అందించేస్తే పోయింది గొడవ వదులుతుంది." అనుకుని మెల్లగా గడియతీసి తను తలుపు వెనగ్గా వారకి నించుని టవల్‌ని చేత్తో పట్టుకుని చేయి చాపింది యివతలకి.

ప్రభాకరం "ఏదీ? ఏదీ?" అంటూ టవల్ అందుకునే మిషతో తన చేతివేళ్లని ఆమె చేతిమీద మోచేయి దాటి భుజందాకా వెళ్లనిచ్చేడు.

"ఛీ! కళ్లుమూసుకుని టవల్ అందుకుంటున్నట్టు ఏమిటావేషాలు? యూ. రాస్కెల్." అని అరుద్దామనుకుంది.

తప్పయిపోయింది. తలుపు తియ్యడం తప్పయిపోయింది. గబుక్కున తన చేయి లాగేసుకుని దడ్‌మని తలుపు వేసేబట్టి సరిపోయింది. లేకపోతే... ... హమ్మో!

తన భయం, పిరికితనం అతను పసిగట్టేడు. అందుకే ఆటలాడుతున్నాడు.

అతని చేయి తగిలిన చోటంతా గొంగళి పురుగు పాకినట్టుగా అనిపించి మళ్లీ పూర్తిగా స్నానం చేసింది...

ఈ సంఘటన జరిగేక అతను తనని కూతురిలా భావిస్తున్నాడు అని మనసులో సరిపెట్టుకుందికి ఏమాత్రం అవకాశం లేకుండాపోయింది. అతని స్వభావం బయటపడుతూనే వుంది. భర్తతో చెప్పుకుందామంటే... అతగాడు యింటికే సరిగ్గా రాడు. తనని పట్టించుకోడు. ఎంత సేపూ వుంచుకున్న దానితోనే అతని రోజులు వెళ్లిపోతున్నాయి.

జయంతికి చింత పట్టుకుంది. జరుగుతున్నదంతా ఎవరికైనా చెప్పేసి తన గుండె బరువు

తగ్గించుకోవాలి! కాని ఎలా? తను చెప్పినా ఎవరు నమ్మతారు? అందరి ముందూ "అమ్మా! జయంతీ!" అని ఆప్యాయంగా పిలిచే మావగారు 'అలాంటివాడు' అంటే అందరూ తన ముఖం మీదే ఛీ కొడతారేమో. అలాంటి పెద్దమనిషి మీద నింద వెయ్యడానికి నీకు సిగ్గులేదూ! అసలు నువ్వే అలాంటి దానివయివుంటావు. నీ బుద్ధే పెడదారి పట్టివుంటుంది. మొగుడి సుఖం లేదు కనక కోరికలతో కాలిపోతూ నువ్వే అతన్ని రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తున్నావు కాబోలు!" అంటూ తన ముఖం మీదే వుమ్మేస్తారు! భగవంతుడా! ఏది దారి?!...

జయంతి రోజు రోజుకీ బెంగతో నీరసించిపోసాగింది. అన్నం సహించడం లేదు. నిద్రపట్టడం లేదు. పెళ్లి కాకముందు వున్న వుత్సాహం యిప్పుడు మచ్చుకైనా కనబడ్డం లేదు. గాలి తీసేసిన బెలూన్‌లా, ప్రాణంలేని బొమ్మలా వుంది జయంతి. ప్రాణం కంటె పరువు ముఖ్యం అనుకునే కుటుంబంలోంచి వచ్చింది తను. అతనికి వ్యతిరేకంగా ఎవరికి చెప్పినా ఎవరూ నమ్మరు. "పైగా తండ్రిలాంటి వ్యక్తి మీద అభాండాలు వేస్తావా?" అంటూ తిడతారు! ఏం చెయ్యడం? ఏం చెయ్యాలి? ఎవరూ నమ్మలేని 'నిజం' ఇది.

★ ★ ★

స్నానపుగది - తువాలు ఉదంతం తరవాత; వారం కూడా గడవలేదు; ఒకనాటి రాత్రి... 'మామగారు' మధ్యగదిలోకి చేరి జయంతి చేయి పట్టుకున్నాడు. జయంతి విదిలించుకున్నా ఆయన వదల్లేదు. ముందు గదికీ మధ్య గదికీ మధ్య ఉన్న తలుపుకి గడియ బిగించి మరీ వచ్చాడు.

"నా మాటవిను. నాతో ఉండు. నీకేం భయం లేదు. ఎవ్వళకీ తెలియదు. మా వాడేమో ఆ జలజని వదల్డు. అది జలజకాదు, జలగ. అది వీణ్ణి వదల్దు. నీ అత్తగారేమో ఆ మాత్రలు వేసుకొని ఒకటే నిద్ర. అనవసరంగా నువ్వు కోరికల్ని అణుచుకోవడం ఎందుకు? నేనున్నాను కదా! ఇదేం తప్పు కాదు. మనం ఆకలి వేస్తే అన్నం తినడం లేదూ! ఇది కూడా అంతే. ఇంకొక రకం ఆకలి, అంతే. మొగుడూ తండ్రీ... యిలాంటి చాదస్తాలు పెట్టుకోకుండా... రా!" అంటూ మీదకు లాక్కున్నాడు. జయంతి పెనుగులాడింది. అతని భల్లూకపు పట్టు నుండి విడిపించుకోవడం ఆమెకి చాలా కష్టమైపోయింది. ఆఖరికి అతని చేతిని కసితీరా కొరికేసి తలుపు గడియ తప్పించి ఎలాగో బయటపడింది జయంతి.

ముందుగదిలో 'అత్తగారు' నిశ్చింతగా గుండెమీద చెయ్యి వేసుకుని నిద్ర పోతోంది. జయంతి ఆ తలుపు కూడా తెరుచుకొని బైటికొచ్చి మెట్లమీదకొచ్చింది. వెనక్కి తిరిగి తలుపుకి ఇవతల గడియ వేసింది. అక్కడ కొంతసేపు కూర్చున్నాక అత్తగారూ, మామగారూ లోపల్నించి కేకలు వేస్తూ తలుపులు బాదేరు. అత్తగారి గొంతు విని కొంచెం ఊరట కలిగి ధైర్యం వచ్చి తలుపు తీసింది జయంతి. 'ఏంమ్మా, ఇవతలున్నావా?' అంది అత్తగారు. 'లేదండి. లోపల ఫేన్ చెడిపోయింది. గాలికోసం' అంది జయంతి. 'అబ్బే, ఫేన్ బాగు చేస్సేనుగా. పద పద, లోపలికి!' అన్నాడు మామగారు. ఇద్దర్నీ తప్పించుకొని లోపలికొచ్చింది జయంతి. 'అత్తయ్యగారూ, నాకేదో భయంగా వుంది, మీరూ ఇక్కడే పడుకోండి, మీ అబ్బాయిగారెలాగూ రారు కదా,' అనగానే భ్రమరాంబ 'ఏమిటో!' అంటూనే ఒక దిండూ, దుప్పటీ మధ్య గదిలోకి తెచ్చుకుని చాప పరుచుకొని పడుకుంది.

ఇహ లాభం లేదు. ఇలా భయపడుతూ కూర్చుంటే సమస్య పరిష్కారం కాదు. ఏదో ఒకటి వెంటనే చెయ్యాలి. ఈ నరరూప రాక్షసుడి బారి నుండి, ఈ కీచకుడి బారినుండి తనని తాను రక్షించుకోవాలి. ఎలాగా ఎలాగా అని ఆలోచించుకుంటూ రాత్రంతా మేలుకొని కూర్చోగా ఒక ఆలోచన వచ్చింది జయంతికి. జరుగుతున్న వ్యవహారం సూచనప్రాయంగా అత్తగారితో చెప్పింది, జయంతి. 'ఆయనకేమో ఇల్లు పట్టదు, నేనూ అక్కర్లేదు. ఈయనకేమో మీ నిద్దరవల్ల తన కాలక్షేపానికి వీలు కుదరడం లేదు. అందుకే 'అనువ్వాడి పెళ్లాం వాడకందరికీ మరదలన్నట్టుగా' అయింది, నా పని. కావాలంటే మీ కళ్లతో మీరే చూడండి. నిజం తెల్సుకోండి. నన్ను రక్షించండి" అంటూ ప్రాధేయపడింది. "ఒక్కరోజు నిద్దరమాత్తర్లు మానేస్తే చాలు. 'నిజం' మీకే తెలుస్తుంది!".

ఆరాత్రి... గదిలోపల... సింథటిక్ చీర, మాచింగ్ బ్లౌజ్, తల్లో మల్లెపూల దండతో ఆమె కిటికీ దగ్గర నించుంది. అతను తెల్లటి ఇస్త్రీ పంచె, లాల్చీ, ఘుమఘుమ లాడుతూన్న సెంటు దట్టించి చాలా హుషారుగా గదిలోకి అడుగు పెట్టేడు. కిటికీవైపు తిరిగి వున్న ఆమె భుజం మీద చేయివేసి "జయంతీ! నిన్న అంత గొడవ చేసినా ఇవాళ దయ తలిచేవు. నేను చెప్పేను కదా, నీకు మాత్రం కోరిక లేదా!... థాంక్యు. నేనింక నిన్ను వదలను. నీవేడీ చలవా తీరుస్తూ నిన్ను బాగా చూసుకుంటాను....." ఇంకా ఏదో మత్తుగా అంటున్న అతని చెంప ఛెళ్లుమంది. అంతే! అతని కళ్లు బైర్లు కమ్మేయి!

ఎదురుగా భ్రమరాంబ! భద్రకాళిలా కోపంగా చూస్తూ!

కసితీరా అతన్ని చితకబాదేసింది ఆవిడ.

"ఛ! నేనెంత తెలివితక్కువదాన్ని! ఎంత అజ్ఞానంలో వున్నాను! ఇలాంటి వెధవనా... నమ్మి నేను ఇన్ని సంవత్సరాలూ కాపురం చేసేను! ఇప్పుడు తెల్సింది నా కొడుక్కి ఎవరి బుద్ధులు వచ్చేయో! తండ్రికి తగ్గ కొడుకన్న మాట వాడు! ఛీ! వీడ్ని చంపేసి జైలుకెళితే ఇంకానయం." ఆవేశంతో పిచ్చి దానిలా అరవసాగింది ఆవిడ.

అంతా చూస్తూ అప్పుడే లోపలికి వచ్చిన జయంతిని ఆవిడ మనసారా అక్కున చేర్చుకుంది. "ఇలాంటివాళ్లకి శిక్ష పడేట్టు చేస్తేగాని మనశ్శాంతి వుండదు" అనుకుంది.

"నే పాపిష్టిదాన్ని! నన్ను క్షమించు. పదమ్మా! ఇలాంటి యింట్లో యింక ఒక్కక్షణం కూడా వుండొద్దు. వీళ్లు ద్విపాద పశువులు. మేకవన్నె పులులు. పయోముఖ విషకుంభాలు. వావివరసలు తెలియని నరరూప రాక్షసులు. నాకు చాలా సిగ్గుగా వుంది. పద, వీళ్ల నీడ మనమీద పడినా ప్రమాదమే. నీకు నేనున్నాను. ఆ భగవంతుడు మనకి ఏదోదారి చూపించకపోడు పద!" అంటూ జయంతి చెయ్యి అందుకొని బయటకు నడిచింది భ్రమరాంబ.

★ ★ ★

*(ఆంధ్రభూమి, మంత్లీ ; జూలై 2001)*